కట్నం తెచ్చిన పేచీ

ప్రమీల పెళ్ళికి కామేశం, నరసింహం వస్తారని కాని కనీసం శారదా, హేమలనైనా పంపిస్తారని కాని జగన్నాథం అట్టే ఆశలు పెట్టుకోలేదు శ్యామల పెళ్ళినాడు జగన్నాథం దురదృష్టం కొద్దీ కామేశానికీ, నరసింహానికీ అతని మీద బాగా కోపం వచ్చింది. అంతే - మళ్ళా శారదా, హేమా యింతవరకు పుట్టింటి గడప తొక్కనేలేదు. కనీసం వాళ్ళదగ్గర నుండి కార్డు ముక్కైనా రాలేదు.

అలాగని జగన్నాథం ఏ లోపమూ చేయలేదు. శుభలేఖలు పంపించాడు. దాంతోపాటు తన తప్పులన్నీ క్షమించి పెళ్ళికి తప్పక రావలసిందంటూ ఉత్తరాలు వ్రాశాడు, మనుష్యుల్ని పంపించాడు - ఇన్నీ చేసి దేవుడి దయవుంటే వస్తారు. లేకపోతే లేదని - దేవుడిమీద భారం వేసి కూర్చున్నాడు. పెళ్ళిదగ్గర పడుతున్న కొద్దీ వాళ్ళజాడ లేకపోయేసరికి జగన్నాథం వాళ్ళవిషయంలో పూర్తిగా నిరాశ చేసుకున్నాడు. అల్లుళ్ళ నిరంకుశత్వాన్ని తలచుకుని పెళ్ళిలో శారదా హేమలను చూడటానికి నోచుకోలేదే అని కంట తడిపెట్టుకున్నాడు.

ఈ పరిస్థితిలో, పెళ్ళి యింకో పూట వుందనగా యిటు కామేశం, అటు నరసింహం సకుటుంబంగా విచ్చేశారు. జగన్నాథం మొదట తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. సంభ్రమాశ్చర్యాలతో జగన్నాథానికొక క్షణం నోటమాటే పెగల్లేదు. జగన్నాథం ఆప్యాయంగా దగ్గరకెళ్ళి పలకరించబోయేసరికి కామేశం నరసింహం ముఖాలు చాటుచేసుకుని వీధిలోకి వెళ్ళిపోయారు.

ముందు నరసింహమే పలకరించాడు. కామేశాన్ని: "ఏమండోయ్. మీ వాటా మీకు ముట్టిందనుకుంటా" అన్నాడు నరసింహం ఎంతో కసిగా.

"మీకు?" ప్రశ్నకు ప్రశ్న సమాధానంగా వచ్చింది కామేశం దగ్గరనుంచి.

"అహ-అది కాదులెండి. డబ్బు చేతిలో పడితేనే కాని మళ్ళీ యీ గుమ్మం తొక్కనన్నారుకదూ — అందుకని." తన వాటా ఎగనామం పెట్టి మామగారు కామేశానికెక్కడ చెల్లించేశాడోనని నరసింహంగుర్ర.

"మీరు మాత్రం తక్కువ తిన్నారా ఏమిటి? మీరూ అలానే అన్నారుగా?"

"హ్రూ-మరేం చేయమంటారు? మీ వంతు చేతిలోపడింది కాబట్టి మీరొచ్చారు. డబ్బు ఎగనామం పెట్టినా నేనువచ్చాను అదేదో ముఖాముఖి పరిష్కారం చేసుకుపోదామని."

"రైటు పదండి. నేనూ వస్తాను. నేనూ ఇదేదో తేల్చుకుందామనే వస్తి" అన్నాడు కామేశం.

"ఆ...ఏమిటి?..." నరసింహం మొహం మీద ఆనందరేఖలు వెల్లివిరిశాయి ఇద్దరూ

మందరపు పద్మ, లలిత

సంతోషంగా ఒకరిభుజంమీదొకరు చేతులు వేసుకున్నారు.

అసలువిషయం ఏమిటంటే......

జగన్నాథానికి నలుగురూ కూతుళ్ళే. అందులో శారద మొదటిది. శారదకు సంబంధాలు వెతికి తీసుకురావటంతో అతని అస్తికలన్నీ అరిగిపోయాయి. ఆడపిల్లలు తల్లిదండ్రులకు శాపంలాంటి వాళ్ళని అతనికి శారద పెళ్ళిప్రయత్నాలు చేసేంతవరకూ తెలీదు. జగన్నాథం స్థితిపరుడు కాకపోవటాన్ని కట్నం యివ్వటానికెంతో కటకటలాడిపోయాడు. పేదవాడైతే మాత్రం కనికరించే దెవరు? కట్నం కక్కితేనే కాని కన్య మెళ్ళో పుస్తె పడదు! వరుడి తరపు వాళ్ళడిగే కట్నం, కానుకలు యిచ్చుకోలేక జగన్నాథం అనేక సంబంధాలు జారవిడుచుకోవాల్సివచ్చింది. చివరకు స్కూలు ఫైనల్ చదివి ఏదో గుమాస్తాగిరి వెలిగిస్తున్న కామేశంతో బేరసారాలు సాగాయి. సంబంధం స్థిరపడింది. పెళ్ళి జరిగిపోయింది.

తర్వాత కొద్దిరోజులకే హేమకు తలవని తలంపుగా సంబంధం కుదిరింది. హేమ మొగుడు నరసింహంకూడా స్కూలుఫైనల్ వరకే చదువుకున్నాడు. పెళ్ళినాటికింకా ఏ ఉద్యోగంలోనూ చేరబడలేదు. జగన్నాథం మొదటి అల్లుడు కామేశానికి ఏమాత్రం కట్నం, కానుక లిచ్చాడో నరసింహానికీ అంతే యిచ్చి పెళ్ళి జరిపించాడు. ఆ మాటకొస్తే హేమ పెళ్ళి శారద పెళ్ళికి డిట్టో.

అంతవరకూ బాగానే వుంది. కాని... వచ్చిన తగవంతా శ్యామల పెళ్ళితోనే. ఒకదానివెంట ఒకటి గబగబా రెండు పెళ్ళిళ్ళు చేసేసరికి జగన్నాథం పరిస్థితి మరీ అధ్వాన్నమైపోయింది. హేమ పెళ్ళి జరిగిన ఐదేళ్ళవరకూ శ్యామల పెళ్ళి తలపెట్టలేదు. శ్యామలకు వరుణ్ణి వెదికి తీసుకురావటంలో జగన్నాథం యిదివరకంటె ఎక్కువ హైరానాపడ్డాడు.

తనదగ్గర డబ్బేమీ పెరగలేదు కాని కట్నం రేట్లు బాగా పెరిగిపోయాయి. ఈ సంగతి గ్రహించిన జగన్నాథం యిదివరకటి పెళ్ళిళ్ళ కయినంత మొత్తంలో శ్యామల పెండ్లి ఎలాగో కానిచ్చెయ్యగల ననుకున్నాడు. ఇదివరకిచ్చినట్లుగానే కట్నం, కానుకలు యివ్వటానికి సంకల్పించుకుని సంప్రదింపులు సాగించేసరికి రోజులు చాలా మారాయని బోధపడింది జగన్నాథానికి. దాంతో జగన్నాథం చాలా తికమకపడ్డాడు.

చివరకు వెయ్యిన్నూట పదహారు కట్నం, దానికి తగినట్లుగా లాంఛనాలు—ఇన్నీ కక్కితేనేకాని శ్యామలకు పెళ్ళి కాలేదు. కట్నం విషయంలో ఎంత కటకటలాడినా, చేసేదేమీ లేక తల తాకట్టు పెట్టి, అడిగినంతా ఇచ్చుకుని బి. ఏ. చదివిన సుందర్ చేత శ్యామల మెళ్ళో పుస్తె కట్టించాడు.

వచ్చిన తగవంతా అక్కడే.

జగన్నాథం వరుడిచేతిలో వెయ్యిన్నూట పదహార్లు పోసేసరికి కామేశానికి, నరసింహానికి తల గిర్రున తిరిగినట్టయింది.

"ఏమండోయ్ అన్నగారూ! చూశారా ఈ అన్యాయం! మనిద్దరికీ చెరొక ఐదొందలతో సరిపెట్టేసి, ఇతనికి వెయ్యిన్నూటపదహార్లు ధారపోస్తున్నాడు. ఎక్కడయినా యింత అన్యాయమా?" అన్నాడు నరసింహం ఎంతో కసిగా.

కామేశాని కసలే వళ్ళు మండుతోంది.

"ఊఁ. చూస్తూనే ఉన్నా" అన్నాడు మనసులో ఏదో పథకం వేస్తూ.

ఎంత పరాభవమో చూడండి. నాకు నిజంగా నే తలకొట్టేసి నట్లుంది. అక్కడకు మనం ఎందుకు పనిరానివాళ్ళ మయినట్టూ, ఇతగాడేదో ప్రయోజకుడయినట్టూ. అందరిలోనూ మనకెంత చిన్నతనం. మనల్నిలా చిన్న చూపు......

కామేశం అవన్నీ వినిపించుకోలేదు.

"ఇంత అన్యాయం జరుగుతూ వుంటే మనం చూస్తూ వూరుకో కూడదు. సరిగ్గా ఇలానే జరిగింది మా స్నేహితుడు రామారావు విషయంలో. రామారావుకి అతని మామగారు తక్కిన వాళ్ళకిచ్చి నట్టుగానే కట్నం అదీ యిచ్చి పెళ్ళి చేశాడు. కాని నాలుగో కూతురు పెళ్ళిలో పెళ్ళికొడుక్కి ఎక్కువ కట్నం యిచ్చేడు. దాంతో అల్లుళ్ళందరూ చిన్న బుచ్చుకుని కూర్చున్నారు. అయితే రామారావు మామగారు చాలా మంచివాడు లెండి. వెంటనే అతను వాళ్ళ దగ్గరికి వెళ్ళి నవ్వుతూ "చూడండి బాబూ! మీకప్పుడే కోపంవచ్చి నట్టుంది. నేనేమంత అన్యాయపరుడిని కాను. నాకు ఈ అల్లుడొకటి, మీరొకటి కాదు. ఇదిగో మీమీ వంతులు మీరు తీసుకోండి" అని నాలుగో అల్లుడితో సమానంగా మిగతా కట్నం డబ్బులు వాళ్ళందరికీ యిచ్చేశాడట. మన మామగారికా వుద్దేశ్యం ససేమిరా లేదు లెండి, మనంతట మనమైనా అడిగి రాబట్టుకోక పోతే మన నెత్తిమీద చేసులే" అన్నాడు కామేశం, నరసింహం చేయి గట్టిగా నొక్కుతూ.

ఆ సాయంకాలం జగన్నాథం గదిలో ఒంటరిగా కూర్చుని ఏదో వ్రాసుకుంటున్న సమయంలో కామేశం, నరసింహం లిద్దరూ వచ్చి మెదలకుండా నిలుచున్నారు. వాళ్ల ముఖాల మీది క్రోధ చిహ్నాలు చూసి జగన్నాథం కంగారు పడ్డాడు. ఇంతలో కామేశం అసలు సంగతి బైట పెట్టాడు.

"మామాగారూ...అందరం అల్లుళ్ళమే కదా. ఒకళ్ళ కెక్కువ కట్నం, ఒకళ్ళకు తక్కువా ఏమిటి? మాకు రావాల్సిన మిగతా కట్నం మాటేమిటి మరి?" అంటూ మామగారి కేసి చురచుర చూశాడు కామేశం.

జగన్నాథం నిర్ఘాంత పోయాడు.

"ఎక్కడినించి డబ్బు తేను నాయనా? నే నేమైనా వున్న వాడినా ఏమైనానా? మీ రడిగినంత కట్నం మీ కిచ్చాను. ఇతనడిగినంతా యితని కిచ్చాను. కాకపోతే నా దురదృష్టం కొద్దీ అప్పటికీ యిప్పటికీ రోజులు చాలా మారాయి" అన్నాడు జగన్నాథం నిట్టూరుస్తూ.

"రోజులు మారితే మాటకు డబ్బుకు ఇవ్వడైనా, అప్పుడైనా ఒకటే విలువ. కాకపోతే 500 రూ., 1116 ఎప్పుడైనా సమాన మౌతాయా?" అంటూ చిటపటలాడాడు నరసింహం.

"ఆ, ఆ! అంతకోపం ఎందుకు? నేను మాత్రం..." జగన్నాథం బిత్తరి చూపులు చూసి యిద్దరికీ జాలి వేసింది. అంతకాకపోయినా సగం యిచ్చినా సరే, సరిపెట్టుకుందా మనుకున్నారు ఎవరి మనస్సుల్లో వారు.

అప్పటికే ఘర్షణ అందరి చెవుల్లోపడింది. పెళ్ళికొడుకు సుందర్, మరికొంతమంది పెద్ద మనుష్యులు వచ్చి అసలు విషయం తెలుసుకున్నారు.

సుందర్ బి. ఏ. కామేశంకేసి, నరసింహం కేసి చూసి గర్వంగా నవ్వాడు.

"అన్యాయం! అన్యాయం! యెవరి అర్హతనుబట్టి వాళ్లకు కట్నాలు. బి. ఏ. చదివినవాడికీ, స్కూలు ఫైనలు వాడికి ఒకటే కట్నమా? అవ్వ...పుచ్చు వంకాయలు, మంచివంకాయలు వొకే ధరకు వస్తాయామరి? అవీ వంకాయలే, యివీ వంకాయలే నని, పుచ్చు వంకాయలను ఎక్కువధర పెట్టి యెవరైనా కొంటారా?" అంటూ వ్యాఖ్యానించాడు సుందర్.

కామేశానికీ, నరసింహానికీ ఒళ్ళు తెలియనంత కోపంవచ్చింది. అక్కడికి యితనే తనకంటె మహా వూడబొడిచినట్టు. అతనేమో మంచి వంకాయట. తామేమో పుచ్చువంకాయలట.

పైకిమాత్రం కామేశం "చూడండి మీరు అనవసరంగా మా విషయంలో జోక్యం కలుగజేసుకోకండి. మీరు బి. ఏ. చదివినందుకు మీకేదో ఎక్కువకట్నం యివ్వాలని రాసి పెట్టినట్లు మాట్లాడకండి. మీ బి. ఏ. మా స్కూలు ఫైనల్‌తో సమానమే లెండి. రానురాను స్టాండర్డ్ తగ్గిపోతూవుంటే నే" అంటూ సుందర్ వైపు వేడి చూపులు చూశాడు.

"వెధవడిగ్రీ. డిగ్రీదేముంది? ఓ నాలుగేళ్లు కష్టపడితే బి. ఏ.! మీ కావుద్దేశమే వుంటే చెప్పండి. ఓ నాలుగేళ్లు మీ అమ్మాయిని మీ దగ్గరే అట్టే పెట్టుకుంటే, నేనిప్పుడే వెళ్లి కాలేజిలో చేరిపోతాను. పోనీ, ఆ డిగ్రీ ఏదో వచ్చాకే డబ్బు యిద్దురుకాని లెండి" అన్నాడు నరసింహం.

"భేష్! బాగా చెప్పావయ్యా! నేను అలానే చేస్తాను!" నవ్వాడు కామేశం.

శారద కిద్దరు పిల్లలు. హేమ కొక పిల్ల. నాలుగేళ్లు యింతమందినీ పోషించి, ఆ తర్వాత డబ్బు యివ్వకోవాలి. ఓయ్! బాబోయ్! అనుకుని జగన్నాథం నిలువునా నీరైపోయాడు.

"ఇంతకీ డబ్బు యిస్తారా యిలా యివ్వండి లేదా యింక మీకూ మాకూ తెగ తెంపులే – అంటూ విసురుగా జగన్నాథం వైపు నడిచాడు కామేశం. కామేశం కోపం చూసి జగన్నాథం హడలిపోయాడు.

"బీదవాడిని నామీద..."

"కనికారం వుంచబట్టే. కాకపోతే మిగతా లాంఛనాలన్నీ ఇలా చేశారని అలా చేశారని మేమైనా పేచీ పెట్టామా?" అంటూ దాతృత్వంకనపర్చాడు నరసింహం.

"అది సరే కాని, ఆఖరుసారి అడుగుతున్నాను. ఇస్తారా, ఇవ్వరా?" అన్నాడు కామేశం జగన్నాథం కేసిచూసి.

కామేశం అసలే పట్టుదల మనిషి. ఈ వుద్రేకం చూసి అందరూ హడలుకున్నారు.

వ్యవహారం బాగా ముదురుతోందని గ్రహించిన ఓ పెద్దమనిషి "అదేమిటయ్యా! అలా కోపగించుకుంటారు! అతను మాత్రం యివ్వనన్నాడా? చూడు జగన్నాథం వాళ్లనేదో కాస్త శాంతపరచు" అన్నాడు.

"ఎలా? నా పరిస్థితి మీకు తెలియంది కాదుగా?" అన్నాడు నిస్పృహగా జగన్నాథం.

"వాళ్లకు మాత్రం నీ పరిస్థితి తెలియకనుకున్నావా? వాళ్ళు బుద్ధిమంతులే. నువ్వెంత ఇస్తే, అంతకే సంతోషిస్తారు. ఇద్దరికీ చెరొక వంద రూపాయలు చేతిలో పెట్టావా..."

"చాల్లెండి....కానీ తగ్గినా వూరుకునేది లేదు. ఇందాకైతే పోనీ అని జాలి తలచి యిచ్చినంతకే తృప్తిపడే వాడిని. పుచ్చు వంకాయలు, చచ్చు వంకాయలు అని యిన్ని మాటలు తిన్నాక, యింకానా? ఆ పుచ్చు వంకాల తడాఖా ఏదో చూపిస్తా మరి" అంటూ చురచుర చూశాడు కామేశం సుందర్ వైపు.

"జగన్నాథం బాబూ! అంతా ఒక్కసారి ఎలాగూ యిచ్చుకోలేవు. కాబట్టి కొద్ది కొద్దిగా తీర్చుకో. మామగారిమీద కనికరించి కొన్నాళ్లు ఓపిక పట్టండి నాయనా" అని సర్దేశాడో పెద్ద మనిషి.

జగన్నాథం "సరే" నని తలూపాడు. జగన్నాథం మాటలమీద నమ్మకం లేని కామేశానికీ, నరసింహానికీ ఈ తీర్పు రుచించ లేదు.

సరే. ఈ సంగతి మాత్రం జ్ఞాపకం పెట్టుకోండి. డబ్బు ఎప్పుడైతే యిస్తారో అప్పుడే మీ గుమ్మం తొక్కటం" అన్నాడు కామేశం.

"నేను మాత్రం తక్కువ తిన్నానా? నేనీ ఛాయలకే రాను" అంటూ నరసింహం బయటకు కదిలాడు. కామేశం అనుసరించాడు.

కామేశం శారదను తీసుకుని వూరికెళ్ళిపోయాడు. నరసింహం హేమతో తన వూరు చేరుకున్నాడు. ఆనాటినుండి యీనాటివరకూ రాకపోకలు బందు. ఈ రెండేళ్లలో రావాల్సిన మొత్తంలో కానీయైనా తీరలేదు. ఇది చూస్తూనే వాళ్ళకు మరీ మంటగా వుంది.

* * *

"అరె! మీరా ఎప్పుడొచ్చారేమిటి...?" ఎటునుంచో వచ్చి సుందర్ బి. ఏ. నవ్వుతూ పలకరించాడు. కామేశానికీ, నరసింహానికి అతన్ని చూస్తేనే వళ్లుమంట. తనేకదా బి ఏ. అని ఏం గొప్ప, ఏం గర్వం? నరసింహం ముఖం చిట్లించుకున్నాడు. కామేశం చురచుర చూడబోయి ఆగాడు.

పెళ్లికొడుకు ఎమ్. ఏ. అట. ఆ సంగతి శుభలేఖలోనే వుంది. బి. ఎ. గాడే 1116 పుచ్చుకున్నప్పుడు ఎమ్. ఏ గాడు కనీసం రెండు వేలైనా పుచ్చుకోడూ?

"ఆ ఇప్పుడే లెండి. పెళ్లికొడుకును చూశారా? ఎలావుంటాడు? కట్నం ఎంతిస్తారు ఏమిటీ కథ?" అంటూ మామూలు ధోరణిలో మాట్లాడాడు కామేశం.

సుందర్ తల తడుముకున్నాడు. కట్నం సంగతి అదీ నాకసలే తెలీదండి. ఏదో మాటల సందర్భంలో మామగారి నడిగితే 'ఆ నేనేం కట్నాలిస్తాను?' అంటూ అసలు విషయం చెప్పకుండా తప్పించుకున్నారు. ఇంతకీ అతనికి నేనంటే కోపం లెండి. ఆరోజు నేను పానకంలో పుడకలా వచ్చి వ్యవహారం చెడగొట్టానట. లేకపోతే మీరు కొంత తక్కువకైనా వప్పుకునే వారట. ఎవరో చెప్పిన మాటలే లెండి..."

"అలాగే. మరింక వస్తాం" అంటూ కామేశం, నరసింహం అక్కడ నుండి కదిలేరు.

* * *

జగన్నాథం ఎంతో హడావుడిగా తిరుగుతున్నాడు. కామేశం, నరసింహం చరచరా రావటంతో జగన్నాథం ముఖం ఉరిశిక్షపడ్డ నేరస్థుడి ముఖం మాదిరిగా మారిపోయింది. కామేశం గబగబా అడగాల్సినవన్నీ అడిగేశాడు.

"ఇన్నాళ్ళోపికపట్టినా మీదగ్గరనుంచి చిల్లిగవ్వైనా వూడిపడలేదు. మా డబ్బేదో మాకు న్యాయంగా యిస్తారా సరేసరి. లేదా నేను మీకింక అల్లుడినీ కాను మీరు నాకు మామగారూ కారు" అంటూ ఉవ్వెత్తున లేచాడు కామేశం.

జగన్నాథం కళ్ళలో నీళ్లు మెదిలాయి. తను పేదవాడు - అంత డబ్బు కాకపోతే అందులో ఆవగింజంతైనా, చెల్లించలేకపోయాడు. తన స్థితిగతులు తెలిసి కూడా తన్నిలా హింసించడం ఎందుకు?

కామేశం కేకలకు అందరూ పరిగెత్తుకు వచ్చారు. సుందర్ అందరికీ అర్థమయ్యేలాగు అసలు సంగతి విప్పి చెప్పాడు.

"కట్నం యిచ్చేటప్పుడు అందరికీ సమానంగా యివ్వాలా, వద్దా చెప్పండి? మామగారు వీళ్లకేమో తక్కువిచ్చారు. మరి ఆ డబ్బు ఎన్నాళ్ళకి చెల్లించకపోతే వాళ్ళు మాత్రం ఎన్నాళ్లూరుకుంటారు?"

కామేశం, నరసింహం ఆశ్చర్యంగా సుందర్ వైపు చూశారు. ఎవరి అర్హతనుబట్టి వాళ్లకు కట్నమని ఏదేదో పేలాడే ఆ సుందరేనా వీడు? మొత్తానికి సుందర్ తమ పక్షంలోనే కలిశాడు.

"చూడండి. ఇప్పుడీ మోహన్ గారికి మాకంటె ఎక్కువిస్తే, మాక్కూడా అతనితో సమానంగా ఆ పంతు డబ్బు న్యాయంగా యివ్వాలంటారా, లేదంటారా?" అంటూ సుందర్ పెద్దమనుష్యుల నందరినీ ఉద్దేశించి మాట్లాడాడు.

"ఓహో అదా సంగతి" అనుకున్నారు కామేశం, నరసింహం. ఏమయితే నేం? ఇద్దరికీ ముగ్గురయ్యారు. ఇదివరకు రావల్సిన 516 ఇప్పుడీ ఎమ్. ఏ. గాడికిచ్చే కట్నంతో సమానంగా యింకా కొంత—మొత్తానికి చాలా పెద్ద మొత్తమే అవుతుందని తలచుకుని కామేశం, నరసింహం సంతోషించారు. సుందర్ తనకేమాత్రం వస్తుందా అని అంచనాలు వేసుకుంటున్నాడు.

పెళ్ళికొడుకు మోహన్ మూర్తీభవించిన శోకంలోవున్న జగన్నాథం వైపొకసారి ప్రతికక్షులు ముగ్గురి వైపొకసారి చూశాడు.

"మీరనేది అందరికీ కట్నం సమానంగా ఇవ్వాలనే కదూ? అవును. తప్పకుండా. ఇందులో అన్యాయమేమీ లేదు" అన్నాడు మోహన్ ఎం. ఏ. సీరియస్‌గా ఆలోచిస్తూ.

పెళ్ళికొడుకు కూడా తమ పక్షమే. ఇంకేం! రొట్టె విరిగి నేతిలో పడిందంటే పడిందనుకున్నారు ముగ్గురూ.

జగన్నాథం తెల్లబోయి బిక్కరి చూపులు చూశాడు మోహన్ వైపు.

"అన్యాయమనేది మా జన్మలో ఎరగం. మా డబ్బు మాకిచ్చేస్తే మళ్ళీ నోరెత్తుతామేమో చూడండి" అన్నాడు కామేశం మోహన్ మాటలతో మరింత ధైర్యం వచ్చి.

"ఇచ్చేకట్నమేదో మన నలుగురికీ సమానంగా యివ్వాలిగాని, యిందులో ఒకళ్ళకెక్కువ, ఒకళ్ళకు తక్కువా యేమిటి? ఇలాంటివి చూస్తే నాకు మహా అసహ్యం. ఈతకవేదో తీరిస్తేనే కాని నాకు నిద్రపట్టదు" అన్నాడు మోహన్ ముఖం చిట్లించుకుని.

ముగ్గురూ హర్షధ్వానాలు చేశారు. ఎంత పేచీ తెచ్చిందీ దిక్కుమాలినకట్నం అనుకుని పెద్దమనుష్యులంతా నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

"మరి నేను చెప్పినట్లుచేయడానికి మీకేమైనా అభ్యంతర ముందా?" అనడిగాడు మోహన్ ముగ్గురినీ చూసి.

"అబ్బే-లేదు, లేదు" అంటూ ముగ్గురూ ఒకేసారి ఆమోదం తెలిపారు.

"అయితే ముందు మీరిదివరలో పుచ్చుకున్న కట్నం యావత్తు డబ్బూ మామగారికి తెచ్చియిచ్చెయ్యండి" అన్నాడు మోహన్ గంభీరంగా.

"ఆ...అదేమిటి..." అంటూ తెల్లబోయి చూశారు ముగ్గురూ.

"మరే...మామగారు నాకు కానీకూడా కట్నం యివ్వటం లేదు. మరికట్నం అందరికీ సమానంగా వుండాలని మీరు మరీ మరీ ఘోష పెడుతున్నారా?"

ముగ్గురూ నిలువునా నీరై జగన్నాథం వైపు చూశారు. జగన్నాథం హీనస్వరం సవరించుకున్నాడు. "నిజమే నాయనా! నా దగ్గర డబ్బేముందని? అసలు ప్రమీల పెళ్ళి ఎప్పటికయినా చేస్తానా అనుకున్నాను. దేవుడికి నా మీదింకా దయపోలేదు. ఈ మోహన్‌బాబుని చూపించాడు. మోహన్‌బాబు కట్నం లేకుండా పెళ్ళిచేసుకోవటానికి అంగీకరించకపోతే ప్రమీల కసలు పెళ్లంటూ అయ్యేది కాదేమో! అన్నాడు గద్గదికతో.

ఈ తీర్పుతో ముగ్గురూ ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అనుకూలంగా నడుస్తోందన్న కేసు క్షణంలో ప్రతికూలమై పోయింది. ఎవరికీ ఏమాట అంటానికీ తోచటం లేదు. గదంతా భరించరానంత నిశ్శబ్దమైపోయింది. చివరికి ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఒక పెద్దమనిషి.

"ఏదో మోహన్‌గారు మాటవరస కన్నారుకాని, జగన్నాథం యిచ్చిన డబ్బు పుచ్చుకుంటాడేమిటి? ఎవరూ ఎవరికీ ఏం ఇచ్చుకోనక్కర్లేదు. ఇంక పదండి ముహూర్తం దగ్గరపడ్డది" అంటూ పెళ్లిపందిట్లోకి దారితీశాడు.

కామేశం, నరసింహం, సుందర్ "మీకింకా కదలాలని లేదా?" అంటూ నవ్వుతూ మోహన్‌ను చరచరా లాక్కుపోయారు పందిట్లోకి.

జగన్నాథం ఆనందాశ్రువులు తుడుచుకుంటూ అందరి వెనకాల వెళ్లాడు.

★